ప్రారంభమైన పాఠశాలలు

వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలకు రంగురంగులు వేసి అవసరమైన సదుపాయాలు ముషీరాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఓస్‌లు స్వరూపారాణి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. మొదటి రోజు పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాతం పలికారు.

- మొదటిరోజు విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ
- స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. పాఠశాలలు బుధవారం ప్రారంభం కావడంతో గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక)లోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లను, పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేయిస్తున్నామని, తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట డివిజన్ల కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, ఈ.వి జయకుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డి, వై.అమృత డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓవోఎస్ నిజాముద్దీన్, యూసీడీ అధికారి రజిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సదుపాయాలు

అంబర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించి ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నామని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ చెప్పారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో అంబర్‌పేట పోలీస్ బాయ్స్ పాఠశాలలో విద్యార్థులకు ఆయన నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుశీల ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత దుస్తులను విద్యార్థులకు అందజేశారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కవాడిగూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు తల్లిదండ్రులు బంగారు బాటలు వేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఆమె అన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని చిత్రాల నర్సింహులు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ మండల డిప్యూటీ ఏఓఎస్ జయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.దేవదాస్, అరైజ్ ఫౌండేషన్ ప్రతినిధి నీలకంఠ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, డిప్యూటీ డీఈవో చిరంజీవి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి విద్యకోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె పిలుపునిచారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి బస్తీలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని సూచించారు. బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని, తల్లిదండ్రులు ప్రైవేట్‌పాఠశాలలపై ఉన్న మోజును మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఉపేంద్ర, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, హెచ్ఎం మహేష్

చదువుకున్నప్పుడే మంచి భవిష్యత్ : కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హాజరై విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి నగదు బహుమతితో పాటు ప్రోత్సాహకార బహుమతులను అందజేశారు. విద్యార్థుఉక్రమశిక్షణతో చదువుకున్నప్పుడే భవిష్యత్ ఉంటుందని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రత్నం, జానకి, రమాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి



మెమెంటోలను అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సామాజిక సేవతోనే మానవ జీవితానికి సార్థకత

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవతోనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం ప్రజాడైరీ పుస్తక ఎడిటర్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ వార్షికోత్సవ వేడుకలకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డితో కలిసి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ఆడపిల్లల వివాహాల కోసం ఇప్పటి వరకు 8000 మందికి పైగా పుస్తె మెట్టెలు అందజేశామని తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 2,306 యూనిట్ల రక్తాన్ని సేకరించి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అందజేశాం అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్, దర్శక నిర్మాతలు ఎస్వీ కృష్ణారెడ్డి, డాక్టర్ విజయభాస్కర్, రామ్, సత్యనారాయణ, ఉప్పల ఫౌండేషన్ కో-చైర్ పర్సన్ ఉప్పల స్వప్న పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఇందిరాపార్కు వద్ద కార్మికుల రిలే నిరాహార దీక్ష

కవాడిగూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్షలు చేట్టారు. సుద్దాల సురేష్ మాట్లాడుతూ ఎంవీ మోటార్ యాక్ట్ 1961ని ఆర్టీసీలో అమలు చేయాలని, సస్పెండ్, రిమూవ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరాహారదీక్షలో నాయకులు బి.నాగేందర్, బి.యాదయ్య, పి.రవీందర్, శ్రీనివాస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

కవాడిగూడ, ,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ అడ్వకేట్ కాలనీలో ఉన్న బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దోమలగూడలోని తాళ్లబస్తీ, అడ్వకేట్ కాలనీతోపాటు పలు ప్రాంతాల ప్రజలు తెల్లవారుజాము నుంచే ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ టి.రవీందర్, కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జివెంకటేష్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం రమేష్‌రాం. కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎంసి. మహేందర్ బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్‌ముదిరాజ్ భక్తులు పాల్గొన్నారు.

కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలి

- పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన పెన్షనర్లకు సంబంధించిన మూడు కరువు భత్యాలు(డీఏ) వెంటనే విడుదల చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం వినర్సింగ్ రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేంద్రబాబు, పెన్షనర్స్ జేఏసీ సెక్రటరీ జనరల్ టి. శుభకర్‌రావు మాట్లాడుతూ, పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడ్డ ప్రభుతం ఆరునెలలు గడిచినా పెన్షనర్ల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించకూండా కాలయాప చేయడం తగదన్నారు. నగదు రహిత చికిత్సా విధానం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, కమ్యూకేషన్ పిరియడ్‌ను 10 ఏళ్లకు తగ్గించి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి, నర్సింహారెడ్డి, దేశ్‌పాండే, ఆర్థిక కార్యదర్శి నర్సయ్య, రామమనోహర్, పురుషోత్తం, సూర్యనారయణ, వెంకటేశ్వర్లు, జగన్‌మోహన్ పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

'గోసంరక్షణ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలి'

బర్కత్‌పుర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోసంరక్షణ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. మోదీ హయాంలో దేశవ్యాప్తంగా గోవులకు రక్షణ కరువైందని ఆరోపించింది.. బుధవారం కాచిగూడలోని గోశాల పెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, సలహాదారుడు ప్రేమ్‌చంద్‌మునోజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ గోవులను సంరక్షించడంలో, వాటిని కాపాడటంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, అదే దారిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నడుస్తుందని వారు ఆరోపించారు. గోవుల అక్రమ రవాణాను నివారించేందుకు నగర శివారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు.

రైల్వే డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

చిలకలగూడ,జూన్12(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దోస్త్ ఆన్‌లైన్ కోటాలో దరఖాస్తు చేసుకోవచ్చునని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బీబీఏ, బీకాం(ఫైనాన్స్) నూతన కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు, ప్రవేశానికి అన్ని కోర్సులకూ ఆన్‌లైన్ దోస్త్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 1977వ సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ప్రారంభమైన ఈ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు విశాలమైన ఆటస్థలం అందుబాటులో వున్నాయన్నారు. నూతనంగా బాస్కెట్‌బాల్ కోర్టు అందబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌సీఏ.ఇన్...) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడతున్నామని దేవ్‌రాజ్ చెప్పారు.



కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డిని న్యూ ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానం చేసిన బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ తదితరులు

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

16న కృత్రిమ అవయవాల పంపిణీ

బర్కత్‌పుర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణమిత్ర రమేష్ జాగిర్దార్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి రితీష్ జాగిర్దార్ తెలిపారు. ఈనెల 16న కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్‌హాలులో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 684 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశామని వారు చెప్పారు.

ప్రైవేట్ రవాణా కార్మికులను ఆదుకోవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత

చిక్కడపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రవాణా కార్మికులను ఆదుకోవాలని రవాణా కార్మిక సంఘాల నేతలు కోరారు. బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ అధ్యక్షుడు లిఖిత్‌కుమార్ చిక్కడపల్లి విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, విధివిధానాలపై మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ రూపొందించిన నోట్‌ను మంత్రికి అందించామని వివరించారు. మంత్రి స్పందిస్తూ త్వరలో ఆటో, రవాణా సంఘాలతో సంక్షేమ బోర్డు ఏర్పాటుపై చర్యలకు పిలుస్తానని హామీనిచ్చారని వెల్లడించారు. మంత్రిని కలిసినవారిలో మహాసంఘ్ ఉపాధ్యక్షులు హబీబ్, ప్రధానకార్యదర్శి సమ్మయ్య యాదవ్ తదితరులున్నారు.

బాలకార్మికులు కనిపిస్తే 1098కు సమాచారం ఇవ్వండి: ఎస్ఐ

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పనిచేస్తూ కనిపిస్తే వెంటనే 1098కు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని ముషీరాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ చిన్నపిల్లలు బడికి వెళ్లేలా సహకరించాలన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా బుధవారం సొసైటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డి) స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాలకార్మికులు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై స్వప్న, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధి మున్వర్‌చాంద్, శివరాణి, ఇందిరాభారతి, పార్వతి, వెంకటేశ్వరి, హాజీ, పర్వీన్‌బేగం, అనూషా, అక్షా పాల్గొన్నారు.

మున్నూరుకాపు నిత్య అన్నదాన సత్రం నిర్మాణానికి సహకరించాలి

చిక్కడపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకొండగట్టు ఆంజనేయ స్వామి మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని సత్రం వ్యవస్థాప అధ్యక్షుడు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సత్రం నిర్మాణం కోసం 10 గుంటల భూమిని ఆలయ పరిసరప్రాంతంలో తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులు, విద్యావంతులు, మేధావులు, వ్యాపారవేత్తలు, కార్మికులు, తమవంతు సహాయసహకారాలు అందించాలన్నారు.

15న స్ఫూర్తి అవార్డ్స్ ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సత్యసంగీత ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ సాయంత్రం త్యాగరాయ గానసభలో స్ఫూర్తి అవార్డ్స్ ప్రదానసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత ఓంకార్‌రాజు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, సినీనటీనటులు హాజరవుతున్నారని తెలిపారు.

టీజేఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఆకుల శ్రీనివాస్

బర్కత్‌పుర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి (టీజేఎస్) కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఆకుల శ్రీనివాస్ నియమితులయ్యారు. బుధవారం టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ టీజేఎస్ కార్మిక విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేయాలని, కార్మికులకు జీహెచ్ఎంసీ ద్వారానే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆర్. కృష్ణయ్య వినతి

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 20లక్షల మంది ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 7 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కోరారు. బుధవారం బీసీ సంఘాల నాయకులతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ఫీజులు విడుదల చేయక పోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. పేదల ప్రభుత్వంగా చెప్పుకునే సీఎం రేవంత్ వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, ఆంజి, రాజేందర్, వేముల రామకృష్ణ, రఘుపతి, పర్వతాలు తదితరులు ఉన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య తదితరులు

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం కోసం రూపొందించిన ప్రణాళికను ఇవ్వండి

- జవహర్ స్కూల్ వద్ద వరద నీరు నిలిచి తరచూ ప్రమాదాలు
- అధికారులపై కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ ఆగ్రహం



అధికారులతో కలిసి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి): అశోక్ నగర్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు వెళ్లే దారిలో జవహర్ స్కూల్ వద్ద వరద నీరు నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు వాహనదారులు, పాదచారుల ఫిర్యాదు మేరకు బుధవారం స్టీల్ బ్రిడ్జిప్రాజెక్ట్ ఏఈ సురేష్ కుమార్, ప్రాజెక్ట్ ఏఈ సాయికృష్ణ, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఏరియా ఇన్‌చార్జి శంకర్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ సమస్యాత్మక ప్రదేశంలో పర్యటించారు. ముందస్తుగా వరదనీరు వెళ్లే కచ్చానాలాలో వ్యర్థాల తొలగింపు చేపట్టినప్పటికీ, రోడ్డుపై నీరు నిలిచిపోవడానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూపొందించిన ప్రణాళికను అందించాల్సిందిగా ఆమె అధికారులను కోరారు. వర్షాకాలం దృష్ట్యా సమస్య పునరావృత్తం కాకుండా వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పి. నర్సింగ్‌రావు, అరుణ్‌కుమార్, ప్రశాంత్, ప్రవీణ్, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలిన తమ్ముళ్లు

రాంనగర్ /చిక్కడపల్లి/ అంబర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడాన్ని స్వాగతిస్తూ రాంనగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నగర ప్రధానకార్యదర్శి పలుస బాల్‌రాజ్ గౌడ్‌ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. జీహెచ్ఎంసీ కార్మికులు, ప్రజలకు అల్పాహారం పండ్లు పంచిపెట్టారు. అమరావతిలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి నగరం నుంచి టీడీపీ నాయకు తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవిందర్‌కుమార్, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సాయిబాబా, నల్లెల కిషోర్, ఎంకె బోస్, కట్టా రాములు. నాగునాగేష్, కార్యకర్తలు తరలివెళ్లారు.



స్వీట్లు పంచుతున్న టీడీపీ నేతలు వెంకటేష్ చౌదరి

అంబర్‌పేట, చిక్కడపల్లిలో

అంబర్‌పేటలో టీడీపీ నేతలు వెంకటేష్ చౌదరి ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకొన్నారు. చిక్కడపల్లిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. పలువురు జర్నలిస్టులు రోడ్డున పోయేవారికి స్వీట్లు పంచిపెట్టారు.

ప్రభుత్వ పాఠశాల భవనానికి ఆర్టీసీ తాళం

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్‌లోని ఆర్టీసీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు ఆర్టీసీ అధికారులు తాళం వేశారు. దాంతో ఆ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు రోడ్డున పడ్డారు. రిసాలగడ్డలోని ఆర్టీసీ స్థలంలో సంస్థకు చెందిన ఉద్యోగుల పిల్లల కోసం ఆర్టీసీ యాజమాన్యం 1952లో అక్కడ పభుత్వ పాఠశాలను ప్రారంభించింది. కొంతకాలం క్రితం ఆర్టీసీ యాజామాన్యం కాలనీని ఖాళీ చేయించి క్వార్టర్స్‌ను కూల్చివేసింది. ఈ పాఠశాలలో రిసాలగడ్డ, హరినగర్, రాంనగర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనాన్ని ఖాళీ చేసి, తమకు అప్పగించాలని, విద్యార్థులను సమీపంలోని పాఠశాలకు మార్చుకోవాలని విద్యాశాఖ అధికారులకు గత నెల నోటీసులు ఇచ్చారు. పది రోజుల క్రితం టీచర్ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇతరత్రా సామగ్రిని పాఠశాలలో పెట్టి తాళంవేసి వెళ్లిపోయారు. బుధవారం పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. అప్పటికే పాఠశాలకు తాళం వేసి ఉంది. స్కూల్ టీచర్ కార్పొరేటర్ రవిచారికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగారవిచారి మాట్లాడుతూ, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాఠశాలకు తాళం వేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్ రోడ్డున పడిందన్నారు.



సమాచారం లేదు

ప్రభుత్వ పాఠశాల భవనానికి ఆర్టీసీ అధికారులు తాళం వేసిన విషయంపై 'ఆంధ్రజ్యోతి' డిప్యూటీ ఐఓఎస్ స్వరూపను వివరణ కోరగా తమకు సమాచారం లేదని తెలిపింది.

మహిళను బెదిరించి రూ.6.45లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సీబీఐ దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలు జరిగాయని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుంచి రూ.6.45 లక్షలు లూటీ చేశారు. షాక్ నుంచి తేరుకున్న మహిళ మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ గృహిణికి ఇటీవల గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. ముంబైలోని కనకియా పోలీస్‌స్టేషన్‌లో మీపై కేసు నమోదైంది. మీ ఫోన్ నంబర్ నుంచి అసభ్య మెసేజ్‌లు, నేరపూరితమైన నకిలీ ప్రకటనలు సర్క్యులేట్ అయినట్లు, మీ బ్యాంకు ఖాతా నుంచి అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేలిందని చెప్పాడు. మీపై నమోదైన క్రిమినల్ కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలు చూపిస్తామని నమ్మించిన నేరగాళ్లు.. బాధితురాలితో స్కైప్ కాల్‌లో మాట్లాడారు. ఆమె ఆధార్ కార్డు, కెనరా బ్యాంకు ఖాతాలో లింకు చేసిన ఆధార్ కార్డు అక్కటే అని చూపించారు. ఈ కేసును సీబీఐ అధికారులు విచారిస్తున్నారని, సుప్రీం కోర్టు నుంచి మీపై అరెస్టు వారెంట్ జారీ అయిందని చూపించారు. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్ చేసిన రూ.200 కోట్ల కుంభకోణంలో మీ పాత్ర ఉన్నట్లు, ఆ మనీ లాండరింగ్‌లో మీ కెనరా బ్యాంకు ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లభించాయని నకిలీ పత్రాలు చూపించి భయపెట్టారు. ఏ క్షణమైనా మిమ్మల్ని అరెస్టు చేస్తారని బెదిరించారు. ఈ కేసులోంచి బయటపడాలంటే మీ ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని ఆర్‌బీఐ ఆధీనంలో ఉన్న ఖాతాకు బదిలీ చేయండి, మీ అకౌంట్ లావాదేవీలు అన్ని సక్రమంగానే ఉన్నాయని తేల్చిన తర్వాత మీ డబ్బులు యథావిధిగా మీ ఖాతాలో జమ చేస్తారని నమ్మించారు. దాంతో బాధిత మహిళ తన ఖాతాలోని డబ్బులు వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేసింది. ఆ వెంటనే నిందితులు కాల్ కట్ చేశారు. తర్వాత షాక్ నుంచి కోలుకున్న మహిళ జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పింది. ఇదంతా ఏదో మోసంలా ఉందని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

అంబర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చెత్త కాగితాలు ఏరుకునే ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన అంబర్‌పేట పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో నివసముండే శోభ (21), కుమారి (20) చెత్త సేకరించుకునే పనిచేస్తున్నారు. ఈ నెల 12న చెత్త కాగితాలు ఏరుకునేందుకు వీరిద్దరూ ఇంటి నుంచి బయటకు వెళ్లి, రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. వారిద్దరి కోసం కుటుంబసభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం రాత్రి అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.